# ఇంటిముందు జానపద గీతం

వీధికానుకుని వున్న ఆగదిలోకి, తలుపుల్ని తీసుకుని, ఉదయం వెలుతురు ఓ రెండు కాళ్ల కడియాల శబ్దంలా వస్తుంది.

ఆ శబ్దం సముద్రం ఉచ్ఛ్వాసలా, కెరటాల నిశ్వాసలా ఉంటుంది.

ఆ వెలుతురు శబ్దానికి, ఆ ఒంటరి గదిలోని అతనికి మెలకువ వస్తుంది. గది తలుపులు ఆత్రుతగా తెరుస్తాడు. దుమ్మూ, ధూళీ నెమ్మదిగా కదిలే గాలి పాయల్లోంచి, ఒక జానపద గీతం విడివడి, వీధిలోని ఆకుల్నీ, అరికాళ్ళనీ, పెను జీవిత వేగాన్నీ తప్పించుకుని, అకస్మాత్తుగా మనిషి మీదకు పాకే స్పందనలా, ఆ జానపద గీతం ఆ గది నిండా, అతని మనసు గది నిండా వ్యాపిస్తుంది.

ఆ పాట అప్పుడతనికి చల్లని మంచుకి తడిసిన పచ్చని పంట పొలంలా ఉంటుంది.

అక్షరాల్ని వరికంకులుగా పొదుగుకున్న పాట, భావాన్ని చెమట బిందువుల్లో చేదుకున్న కాళ్లని చుట్టుకుని ఆ పాట రహస్యంగా వెళ్ళిపోయినా, గొంతులోంచి వచ్చిన ఆ రాగం మిగిల్చిన చప్పుడు –

అతనిలో ఉదయాల్ని మధ్యాహ్నాలుగా, మధ్యాహ్నాల్ని సాయంత్రాలుగా, సాయంత్రాల్ని రాత్రులుగా, రాత్రుల్ని పసిడి పచ్చటి పగళ్లుగా చేస్తుంది.

ఆ తెలంగాణా పల్లెపిల్ల తెల్లగా వుంటుంది. ఆమె నల్లటి కనుపాపల చుట్టూ తెల్లని మెరుపు. ఆ కళ్లు పంట పొలంలో బావుల్లా ఉంటాయి. వంటికి రంగు రంగుల లంబాడీ దుస్తులు. భుజాల కింద నుంచి మణికట్టు వరకూ తెల్లటి ప్లాస్టిక్ గాజులు. ఎర్రటి ఎరుపు రంగు రవిక. ఆ రవిక మీద అంచులా చిన్న చిన్న అద్దాలు. రకరకాల దారాలతో నగిషీల బొమ్మలు.

రవికకు వెనక తాడు సరిగా ముడేసుకోకపోవడం వల్ల, ముందున్న వక్షస్థలం పై నున్న ఆకారానికి ఆ రవిక సరిపోకపోవడం వల్ల అచ్ఛాదన కరువై కింద అర్ధ చంద్రాకారపు సౌందర్యం, ఆ కింద లోతైన నాభి, నాభిని ఆనుకుని మళ్ళీ ఆకుపచ్చటి రంగుటద్దాల లంగా, కాళ్లకు మకిలి పట్టిన వెండి కడియాలు.

"ఏవూరు మీది...?" అనడిగాడతను.

అతనున్న గదికి కొంచెం దూరంలో ఉందో కిరాణా దుకాణం. ఆ దుకాణానికి ప్రతి రోజు సాయంత్రం పనినుండి ఇంటి కెళ్ళేటప్పుడు సరుకులు కొనుక్కోవడానికి వస్తుందా పల్లెపిల్ల. ఆ పల్లెపిల్ల వెనక ఓ చిన్నపిల్ల. ఆ పిల్లకు పదేళ్ళుంటాయి. ఇద్దరూ కలిసే పనికివెళ్తుంటారు. కలిసే పనినుంచి వస్తుంటారు. పెద్దపిల్ల ఖర్జూరపు పువ్వులా ఉంటే, చిన్నపిల్ల ఖర్జూరపు మొగ్గలా ఉంటుంది.

ఆ పల్లెపిల్ల అతని మాటను వినలేదు.

"నిన్నే పిల్లా.. చెప్పు" ఆ ముస్లిం దుకాణదారుడన్నాడు ఆమెతో.

అప్పుడా పల్లెపిల్ల అతని వేపు చూసింది. ఏవిటన్నట్లు కాటుకలేని కళ్లను చిట్లించింది.

"ఏవూరు..?" మళ్ళీ అడిగాడతను.

"పాలమూరు" ఒళ్ళో సరుకుల్ని చూసుకుంటూ అంది. ఏం జ్ఞాపకానికొచ్చిందో.

"ఏవయ్యా పనుందా" అని అతని వేపు చూస్తూ అంది. "లేదు." అతనన్నాడు. మరెందుకన్నట్లు అతని వాలకం వేపోసారి నిర్లక్ష్యంగా చూసి, పోకిరీ అనుకుందో, పనిలేనివాడనుకుందో పక్కనున్న పిల్లదాంతో అన్నట్టుగా నోట్లో ఏదో గొణుక్కుంది. బొడ్లోని పైసల్ని లెక్కపెట్టి దుకాణదారుడికిచ్చి ముందుకి నడిచిందాపిల్ల.

"ఎక్కడుంటారు వీళ్ళు?" వెళ్ళిపోతున్న ఆ పల్లెపిల్ల నడకవేపు చూస్తూ ఆదుకాణదారుడ్ని అడిగాడతను.

"నాగమయకుంట, నయాతండాలో"

"వీళ్ళు పాడే పాటలు హైదరాబాదీ పాటలా, తెలంగాణా పాటలా..."

ఆ ప్రశ్నకు ఆ దుకాణదారుడు అయోమయంగా చూసాడతని వేపు.

"మనకు ఖవ్వాలీలు తప్ప తెలుగు పాటల ముచ్చట తెల్వదు సాబ్..."

ఆ సాయంత్రం –

దుమ్మూ, ధూళిని కలుపుకుని వెనక్కి వెళ్ళిపోతున్న వెలుగు కలుస్తున్న వేళ–

గదికి ఎడమగా, కొంచెం దూరంలో వున్న చౌరస్తాలోని ఇరానీ హోటల్లో అతను టీ తాగుతున్నాడు. ఆ హోటల్ ఇప్పుడు నాంపల్లి స్టేషన్‌లా ఉంది.

ఎవరో చేత్తో పక్కకు తీసేస్తున్నట్టుగా మెల్లగా వెలుగు వెళ్ళిపోతోంది. ఏదో సన్నపాటి గాలి తెరలు. చిన్నపాటి చినుకులు.

అతను,

కేష్ కౌంటర్ పక్కనున్న తలుపు వేపు చూశాడు. ఎప్పుడొచ్చిందో ఆ పల్లెపిల్ల. ఆ పక్కన చిన్నపిల్ల. అమాయకంగా గొంతుక్కూచున్నారిద్దరూ. పనివాడు తెచ్చి రెండు చాయ్‌లిచ్చాడు. నెమ్మదిగా తాగుతోంది. అప్పుడే పని నుండి వచ్చినట్టుగా వుంది. ముఖం కడుక్కున్నా, ముఖానికి పట్టిన ముదురు బురద వదల్లేదు.

అప్పుడు –

సరిగ్గా అప్పుడు –

ఆ పల్లెపిల్ల గొంతు విడివడింది. ఆ గొంతులో మార్ధవం లేదు. కానీ ఆ గొంతులోంచి వచ్చే పాటలో మార్దవం ఉంది. ఆమార్దవంలో కలిసిన ఆర్తి. ఆ ఆర్తి ఎక్కడ నుంచి పుట్టిందో..

బయట చినుకులు లేవు, వర్షం. బయట వెలుతురు లేదు, చీకటి. బయట మనుషులు లేరు, నిశ్శబ్దం. బయట దూళి లేదు, రాగం.

ఇరానీ హోటల్లో మాటలు, కబుర్లు, వాగే రేడియో, సాగే ఖాళీ కప్పుల చప్పుళ్ళు అన్నీ ఆగిపోయాయి. అలా ఓ అరగంట గడిచింది. వర్షపాతంలో, జలపాతంలా పల్లెరాగాల కదలిక.

పెనువర్షం, చిరుచినుకైపోయింది. తాగిన ఛాయ్‌కు డబ్బులిచ్చి ఆ పల్లెపిల్ల, చిన్నపిల్లను తీసుకుని ఎవరి వేపూ చూడకుండా చిన్న చినుకుల్లో తడుచుకుంటూ వెళ్ళిపోయింది.

పురులు విప్పుకుని వర్షంలో తడిసి, ఆనందాన్ని వర్షించిన అడవి నెమలి, మబ్బులు చెదిరేసరికి మళ్ళీ ఏ కోనకో వెళ్ళిపోయినట్టు, వెళ్ళిపోయింది.

★ ★ ★

"ఇరానీ హోటల్లో నిన్న నువ్వు పాడిన పాటలు చాలా మంచిగున్నాయి. మా ఇంటి కొచ్చి పాడతావా... రికార్డు చేస్తాను.... పైసలు కూడా ఇస్తాను." మర్నాడు కిరాణా దుకాణం దగ్గర అడిగాడతను.

"పైసలిస్తే పాటలొస్తయా.... మల్ల" కళ్ళు తిప్పుకుంటూ అందాపిల్ల.

"రికార్డు చేస్తాను, పాడు" అన్నాడతను.

"సిన్మా పాటలా.. మ్యూజిక్కులున్నయా... ఏవో కష్టం పదాలూ, కలుపు పాటలూ.పట్నం మడుసుల కన్నీసిత్రాలే" కొట్టి పారేసిందా పిల్ల.

"ఏదో రికార్డు చేస్తాట్ట..పాడరాదూ... కూలి పైసలిస్తాడ్లే..." ఉర్దూలో నచ్చచెప్పాడు దుకాణపు ఆసామి.

"కూలికి పోకుంట పాడాల్నా... మా మేస్త్రీ బొక్కలిరగ్గొడతడు" అందా పిల్ల.

"కూలి నుంచి వచ్చేటపుడు రా... అదే ఇల్లు... రేపొస్తావా" అడిగాడతను.

"ఈ పాటల్ని ఏం జేస్తవయ్యా." అడిగిందా పిల్ల.

"వినడానికి"

"అంతేనా?"

అతని గదికి ఏడు గంటల ప్రాంతంలో వచ్చిందా పిల్ల. "జనానా లేదా?" ఎక్కడా ఆడవాళ్ళు కనబడక పోవడంతో అడిగిందా పిల్ల.

"లేరు" చెప్పాడతను.

బయట చీకటింకా ముదురు పడలేదు. గదిలో లైటు వేశాడతను. టేప్ రికార్డర్ ఆన్ చేశాడు. ఆ పిల్ల పాడడం మొదలు పెట్టింది.

రాత్రి తొమ్మింది గంటలైంది. గదిలోంచి బయటికి చూసిందాపిల్ల. నిశ్శబ్దంగా చిక్కటి చీకటి. "వెళ్ళాల్నా" బెరుగ్గా అంది.

"నీ గొంతు వింటావా?"

"ఔ" అంది.

టేపు రికార్డర్ లోని కాసెట్‌ని రీవైండ్ చేశాడు.

"మంచిగ ఇనపడింది."పక్కనున్న చిన్నపిల్లతో అంది, కళ్ళల్లోని సంతోషాన్ని కనీ కనబడకుండా కనబరుస్తూ.

"నీ కెన్ని పాటలొచ్చు?" అడిగాడతను.

"చాలా"అన్నదామె.

"అన్నీ పాడతావా" ఆ గొంతులో అభ్యర్థన.

"వినే చెవుంటే. పాడే గొంతేనా మూగబోయేది'' అన్నదామె. జేబులోంచి పది రూపాయలు తీసాడతను. "తీసుకో."

"ఉసుకెత్తిన్నా... ఇటుక తీసిన్నా... ఇంతపదానికి అన్ని పైసలా, వద్దులే బిడ్డా... పదానికి పైసలియ్యడం నీకు మోజేమో నాక్కుదరదు'' గబగబా బయటి కొచ్చిందా పిల్ల. ఆమె నడక చప్పుడులో కలసి పోయిన కడియాల కదలిక.

అతనెప్పుడూ ఆమె బాహ్యాన్ని చూడలేదు. ఆమెలోని పాటనే చూసాడు. ఆమె ఎప్పుడూ అతని ఆకారాన్ని గూర్చి ఆలోచించలేదు. అతనిలోని పాటమీద మమకారాన్ని మాత్రమే చూసింది. ఎక్కడో దగ్గర ఆమె పాడుకుంటుంది.

ఆమెకో ఏకాంతం అవసరం. అది పిల్లకు పాలిచ్చినప్పటి ఏకాంతం కావచ్చు. పనిలోకెళ్ళే దారిలో తనపాదాల సవ్వడిలోని ఏకాంతం కావచ్చు. మనసైన మగవాడితో మనసారా ముచ్చట్లాడుకునే కోరికగా పడుకున్నప్పటి ఏకాంతం కావచ్చు.

మళ్ళీ మర్నాడు సాయంత్రం అదే సమయం. ఆ చిన్నగది లోపల పల్లెపాటలు రంగు రంగుల పక్షుల్లా కువకువలాడాయి.

పశువుల మందను తోలే పల్లెపిల్లల తీరుబడి సరదాలు ఒక పాటైతే, పెద్దమనిషైన పడుచుపిల్ల మనసులోని రాగాలకు ఒక పదాల ఆకారం, గుల్బర్గా కొండ తెగల మనువు ముచ్చట్లు ఒక పాట, తొలినాటి గదిలో కొత్త జంట సిగ్గూ బిడియాల దశ్యం ఒక పాట, కూడు కోసం షహర్ ప్రయాణం ఒక పాట. పాట వింటున్న అతను ప్రతిమ అయ్యాడు. వెళ్ళే ముందు మళ్ళీ పైసలివ్వబోయాడతను. ఆమె తీసుకోలేదు. పైసలు తీసుకోకపోతే, మళ్ళీ రావద్దన్నాడు. గ్రీవం తిప్పి చూసింది. ఆ చూపులో ఏదో భావం. ఆ భావానికి రంగు లేదు.

గబుక్కున ఆమె కుడిచెయ్యి ముందుకి లాగి అరచేతిలో పది రూపాయల నోటుంచాడు. వేళ్ళు మూసాడు.

అతని చొరవకి ఆ పిల్ల నవ్వింది. ద్వారబంధం దాటి వీధిలో కెళ్ళిపోయింది. వీధిలో వెలుతురు లేదు. నడుస్తున్న దీపంలా ఆ పల్లెపాటల తెలంగాణా తెల్లపిల్ల.

ఆరునెలలకై మొలిచిన ఆ తండాలో ముప్పై గుడిసెలు ఇరుకిరుగ్గా వున్నాయి. అవన్నీ బురదలో నిద్రపోతున్నాయి. ఆ గుడిసెల్లో అక్కడక్కడ దీపాలు, మాటలు, కుక్కల ఆవలింతలు.

సరిగ్గా ఆ సమయంలో –

"చచ్చాను... దేవుడోయ్" పెనుకేక వినబడింది. గుడిసెలోకి అడుగుపెట్టిన ఆ పల్లెపిల్ల జుత్తుని పట్టుకుని గుంజి వెనక్కి నెట్టేసాడు మగాడు. బురదలో పడిపోయింది. కోపంగా ముందుకెళ్ళి చేతులు పట్టుకుని పైకిలాగి, కాళ్ళతో గుండెల మీద తన్నాడు. పెనుబాధతో విలవిల్లాడుతూ ఆ పిల్ల దూరంగా పడిపోయింది.

ఆమె ఏడుస్తూ ఏదో చెప్పబోయింది. వినిపించుకోలేదతను.

"కుంటోణ్ణా, గుడ్డోడ్నా... నన్నొదిలి... ఆ పట్నం మనిషితో కులుకుతున్నావ్..." అరిచాడు.

"కులుకుతున్నానా... ఏమంటున్నావ్‌రా... కళ్ళు మూసుకుపోతాయిరా.. తాగి మాట్లాడుతున్నావ్...." కీచుగొంతుతో అరుస్తూ, లేవడానికి ప్రయత్నిస్తూ అందా అమ్మాయి.

"తాగుడు మాట్లా నావి.... బోసిడికే..." రోషంతో పరుగు పరుగున వెళ్ళి ఆ పిల్ల రవికను పట్టుకుని పైకి గుంజాడు. రవిక సర్రున చిరిగిపోయింది. పక్కనున్న కర్ర తీసుకుని ముఖమ్మీద, గుండెల మీద, పొట్టమీద, కాళ్ళమీద రాక్షసంగా కొట్టాడు.

బాధను సహించలేక వాడి పశుత్వం నుండి తప్పించుకోవడానికి ఆ అమ్మాయి నాలుగువేపులా పరుగెత్తింది. తను ఆలస్యంగా రావడానికి కారణం చెప్పడానికి శతవిధాలా ప్రయత్నించింది. కుదరలేదు.

మసక వెన్నెల్లో ఆ అమ్మాయి మకిలి బొమ్మలా అయిపోయింది. ముఖమ్మీద రక్తం. గుండెల మీద రక్తం. పొట్టమీద రక్తం. చేతుల మీద రక్తం. కాళ్ళమీద రక్తం. ఆమె స్పృహ తప్పిపోయింది.

నిషాలో అరకళ్ళతో ఆ బీభత్సదృశ్యాన్ని చూసిన తండా ఆ తర్వాత హమేషాగా నిద్రపోయింది.

గుడిసె బయట బురదలో ఆ పిల్ల. ఆ పిల్ల చేతిలో పాటకు పగిడీలా ఇచ్చిన పదిరూపాయల నోటు నలిగిపోయి దాదాపు ప్రాణం పోయే స్థితిలో ఉంది.

మర్నాడు పన్నెండు గంటల వేళ.

ఆ పల్లెపిల్ల అతని గదిలోకొచ్చింది. చేతిలో రెండేళ్ళ పసిపిల్లవాడు. ఆ సమయంలో ఆమెను చూసి ఆశ్చర్యపోయాడతను.

"పనికెళ్ళలేదా".

"పానం బాగాలేదు" ఆమె ముఖం వేపు చూసాడతను. పెదవులు చిట్లిపోయాయి. ముక్కుమీద సన్నగా చిట్లిపోయిన చర్మంమీద నెత్తురు చార, కందిపోయిన బుగ్గల మీద ఆరుతున్న గాయాలు.

'నీ బిడ్డా' అడిగాడతను.

'ఔ' అంది. చేతిలోని పది రూపాయల నోటుని అతని కందించింది.

"కష్టపడ్డకూలైతే మంచిగుంటది" జవాబిచ్చింది. ఇంటి దగ్గర ఏదో జరిగుంటుందనుకున్నాడు.

"ఛాయ్... తాగుతావా" ఆమె నడుగుతూ, జవాబుకి ఎదురు చూడకుండ గదిలోంచి వీధిలోకి వచ్చి, దూరంగా వున్న ఛాయ్ దుకాణం సాయిబుకి గట్టిగా అరిచి చెప్పాడతను. అయిదు నిమిషాల్లో రెండు చాయ్‌లొచ్చాయి. ఆమెకి ఒకటిచ్చాడు. మొగుడు మీద అలిగి ఉదయం నుంచి ఏమీ తాగలేదామె. మొగుడు పొద్దున్నే పనికెళ్ళిపోయాడు. తండాలోని ఆడజనం కూల్లోకి వెళ్తూ కొంతమంది పలకరించి, మరికొంతమంది సలహాలిచ్చి వెళ్ళిపోయారు.

"మగోడికి అనుమానం వస్తే మనువు కష్టం. పట్నంల రకరకాల సిత్రాలుంటాయి. ఈడ మగోడు కూడా సిత్రమే... జర సక్కగుండు..."

తనేం తప్పు చెయ్యలేదు. కదలకుండా ఆ పల్లెపిల్ల చాలాసేపు కళ్ళు మూసుకుపడుకుంది. మనసులో పరిపరి విధాలుగా ఆలోచనలు.

ఆ తర్వాత కడుపులోకి గుక్కెడు ఛాయ్ నీళ్లు తాగుదామని చౌరస్తాలో కొచ్చింది. అప్పుడే అనుకుంది, అతని పదిరూపాయలు అతనికిచ్చేద్దామని. అందుకే ముందుకడుగేసింది.

"నువ్వు బాగా చదువుకుని వుంటే, భాష బాగా తెల్సివుంటే, మంచి సింగర్ అయ్యుండేదానివి. రాత్రి మూడు గంటల వరకూ నీ పాటలే వింటూ ఉండిపోయాను." అంటూ టేప్ రికార్డర్ ఆన్ చేసాడతను.

ఆమె ఏమీ మాట్లాడలేదు. టేపు రికార్డర్లోంచి వస్తున్న తన గొంతు వేపు చూస్తోందామె. అయిదు నిమిషాలు గడిచాయి. ఒక పెనుకేక.

ఆ కేకకు చటుక్కున కళ్ళు తిప్పి చూసారిద్దరూ. గదికెదురుగా రోడ్డుమీద ఆ పల్లెపిల్ల మగాడు!

"బద్మాష్... ఈడుంటావని నాకు తెల్సే... లంజే.." అతను గబ గబా ముందుకొచ్చాడు. జుత్తు పట్టుకొని గోడకి కొట్టి, జరజరా గదిలోంచి బయటికి లాగి, రోడ్డుమీద ఇసక మీద దొర్లించి, కాళ్ళతో తంతూ "ఇది రంకు కాదా లంజే... సెడబుట్టినవ్ లంజే" అంటూ నోటికొచ్చిన బూతు తిట్లు తిడుతూ కొడుతూ –

ఆమె అరుస్తూ, బాధ సహిస్తూ –

పిల్లాణ్ణి మాత్రం వదల్లేదు. కానీ ఆ మగాడు చేతిలోని ఆ పిల్లాణ్ని లాక్కుని నేలమీదకు విసిరేసాడు.

వాడు కోడిపిల్లలా మూలిగాడు.

అక్కడ ఓ పది నిమిషాలపాటు రాక్షస ఘట్టం. ధ్వంస దృశ్యం.

పదిమంది పట్టుకుని ఆపితేనే గాని ఆమెను వదల్లేదు వాడు. కోపంగా తిడుతూ, అసహ్యంగా ఉమ్మేసి, తండా కొస్తే శవాన్ని చేస్తానని అరుస్తూ వెళ్ళిపోయాడా మగాడు.

ఆ వీధి మధ్యలో ఆ పల్లెపిల్ల. స్పృహ ఉందో లేదో తెలీదు. చచ్చిపోయిందో, బతికుందో తెలీదు.

గదిలో అతను బిక్కచచ్చిపోయి నిల్చుండిపోయాడు.

దుమ్ములో ఓ పక్క ఆ పల్లెపిల్ల పిల్లడు చింపిరిగా ఏడుస్తూ, నెమ్మదిగా నడుచుకుంటూ తల్లి దగ్గరకు వెళ్ళాడు. రవికలోంచి అచ్ఛాదన లేని ఆ తల్లి రొమ్ముల్ని పట్టుకుని పాలుతాగుతున్నాడు. ఆ పాలిండ్ల నిండా గాయాలు. ఎర్రటి గాయాలు.

అందులోంచి పాలు రావడం లేదు.

ఆ విషయం ఆ రెండేళ్ళ పసికందుకి తెలీదు. గదిలో టేపు రికార్డర్‌లోంచి పాట వినిపిస్తూనే ఉంది. ఆ పాటలో ఆ గొంతు సముద్రంలో కలిసి పోయిన జలపాతంలా ఉంది. ఆ జలపాతం జనపాతాన్ని ఒరుసుకుంటూ, దుమ్ములోంచి ధూళిలోంచి, పచ్చటి కొండల దారుల్లోంచి, చీకటి కోనల లోయల్లోంచి అగాధాన్ని ముట్టుతూ, ఆకాశాని చుంబిస్తూ, కాలంలో పరుగెడుతోంది.

హారిక, *16-3-1990*

*